క్లుప్తంగా

పకడ్బందీగా కుటుంబ ఆరోగ్య సర్వే



ఉయ్యాలవాడలో సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందం

ఉయ్యాలవాడ : జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమంపై పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నట్లు టీమ్ లీడర్ తారకాచారి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వైద్యాధికారి రమేష్ చంద్ర బాలాజీ ఆధ్వర్యంలో సర్వే బృందం ఆరోగ్యశ్రీ , జన సురక్ష యోజన, ఆరోగ్య ఆసరా, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, శిశు సంక్షేమ పథకాలపై సర్వే చేపట్టారు. గ్రామంలో 350 కుటుంబాలను ఎంపిక చేసుకుని మొదట 22 కుటుంబాలల్లో ఆయా పథకాలు ఏ మేరకు వర్తించాయనే అంశాలపై కుటుంబ సభ్యులతో వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఇలా నంద్యాల జిల్లాలో 17 గ్రామాల్లో 13 వేల కుటుంబాలను సర్వే చేసి కేంద్ర బృందానికి పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమం జిల్లాలో నవంబర్ 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని ఎస్.కొత్తపల్లె, అల్లూరు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఈ నెల 10,11 తేదీల్లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో స్థానికుల నుంచి వ్యక్తమైన సమస్యల పరిష్కారంలో భాగంగా అల్లూరులో సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం రూ.12.20 లక్షలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ.1.80 లక్షలు, ఎస్.కొత్తపల్లెలో షాదీఖానా నుంచి వెంకటలక్ష్మి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 6 లక్షలు వ్యయం చేయనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం సమీపంలో రైలు కిందపడి శనివారం మహమ్మద్‌రఫి (42) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో నివాసముంటున్న మహమ్మద్‌రఫి రోజువారి కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లిన రఫి బొమ్మలసత్రం వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌పై రైలు వస్తుండగా అందరూ చూస్తుండగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య పర్వీన్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

వంట గ్యాస్ ఉచితంగా ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): జగనన్న గోరుముద్ద మెస్ చార్జీలు పెంచి వంట గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకం కార్మికులకు వేతనాలు చాలకపోవడం, నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతి విద్యార్థికి మెస్ చార్జి రూ.30 పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

వర్షం కోసం ఆంజనేయ స్వామికి పూజలు



ఆంజనేయస్వామి ఆలయం వద్ద భజన నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ముత్యాలపాడు మజరా రామాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ముత్యాలపాడు గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు రవికుమార్ ఆధ్వర్యంలో స్వామికి ఆకు పూజ, అభిషేకం చేసి నైవేద్యం సమర్పించారు. వరుణ దేవుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండిపోతున్నాయని పంటలు బాగా పండాలని స్వామివారిని కోరుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం ఎదుట భజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముత్యాలపాడు, బాచేపల్లె గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీలు

నంద్యాల టౌన్ : ప్రజల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జగజ్జననీ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. ఎంపీ పోచా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, మెరుగైన చికిత్స అవసరమైన వారికి వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులతో వైద్యసేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారని, ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన విభాగాలు, ఓపీ, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, రోగులకు మందులు అందిస్తున్న తీరును పరిశీలించి వైద్యులు, అధికారులకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహార స్టాల్‌లో ఉంచిన వైఎస్సార్ హెల్త్ కిట్‌ల గురించి అంగన్‌వాడీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 561 మంది వైద్యసేవలు పొందారని వైద్యాధికారి ప్రియ భావన తెలిపారు.

ఎన్‌జీఓ కాలనీలో..

పట్టణంలోని ఎన్జీవో కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్యశిబిరంలో కౌన్సిలర్ విజయభాస్కర్ పాల్గొని వైద్యం చేయించుకున్న వారికి మెడికల్ కిట్‌లు పంపిణీ చేశారు. హరిజన వాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 519 మందికి వైద్యం అందించామని అందులో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రెఫర్ చేశామని వైద్యాధికారి సభా బేగం తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు మెరుగైన వైద్యం గ్రామంలో అందుతుందని రుద్రవరం సర్పంచ్ బైరి విజయలక్ష్మి అన్నారు. స్థానిక,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు చెన్నయ్య, నాయక్ తదితరులు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 653 మందికి స్పెషలిస్టు వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ బాలస్వామి, వైద్యులు శివమోహన్,విష్ణు,అమర్నాథ్,శివమోహన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరి బ్రహ్మం పాల్గొన్నారు.

510 మందికి వైద్య పరీక్షలు

శిరివెళ్ల: మండలంలోని గుండంపాడు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సరక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు అనూష, అశోక్‌కుమార్, వెంకటరెడ్డి, దినేష్‌రెడ్డి, దివ్య కంటి, స్త్రీ సంబంధిత, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 510 మంది ఓపీ నమోదు చేసుకొని వైద్యు సేవలు పొందారు. వీరిలో ఐదుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి వాటి విలువలను ప్రజలకు వివరించారు. సర్పంచు మౌనిక, ఎంపీటీసీ సరిత, సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రేవనూరు ఆంజనేయరెడ్డి, వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ శివరామిరెడ్డి, గ్రామ పెద్దలు ప్రతాపరెడ్డి, నుసి నాగిరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, ఏంపీహెచ్ఓ ఉశేనిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి వెళ్లే ప్రయాస తప్పింది



వద్ధాప్యం వల్ల మోకాళ్ల నొప్పులు వచ్చాయి. చూపు కూడా మందగించింది. పెద్దాసుపత్రికి వెళ్లి రావటానికి శక్తి లేక అలాగే కాలం గడుపుతున్నా. సర్వే చేస్తున్నాం అని ఇంటికి వచ్చి రక్త పరీక్షలు చేశారు. ఇంటి దగ్గరలోనే ప్రభుత్వం వైద్య శిబిరం పెట్టి ఉచితంగా వైద్యం చేసి మందులు ఇస్తున్నారు అని చెబితే ఇక్కడికి వచ్చాను. మోకాళ్ల నొప్పుల నివారణకు మందులు ఇచ్చారు. కంటి పరీక్షలు చేసి అద్దాలు ఇచ్చారు. ఆసుపత్రుల చుట్టూ తిరగలేని వయసు పైబడిన మా లాంటి వారిం ఈ వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. –జయమ్మ, నూనెపల్లె



రుద్రవరంలో మందులను పరిశీలిస్తున్న సర్పంచు బైరి విజయలక్ష్మి



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

అనుమతులు లేని ఆస్పత్రులపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, అనుమతులు లేకుంటే సీజ్ చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ శనివారం తెలిపారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పీసీఅండ్ పీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వైద్యాధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పట్టణ ప్రాంతాలలో మూడు ఆసుపత్రులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పిదప పలు లోపాలను గుర్తించినట్లు వెల్లడైన నేపథ్యంలో సరైన అనుమతులు లేకుండా ఆస్పత్రులను నిర్వహిస్తే యాజమాన్యాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీ చేసిన ఆస్పత్రులలో పేషంట్ల నుంచి ఫీజులు అధికంగా వసూలు చేయడం, ఆరోగ్యశ్రీ కార్డు అనుమతి ఉన్నా లేదని చెప్పి ఇబ్బందులకు గురి చేయడం, అనుమతి లేకుండా పీసీపీఎన్డీటీ సెంటర్లు రన్ చేయడం లాంటివి గుర్తించి సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రతి ఆసుపత్రి యాజమాన్యం ఏపీసీఎల్‌ఈ, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం అనుమతులు పొంది ఉండాలన్నారు. అనుమతులు లేని ఆసుపత్రులు వారం రోజుల్లో అనుమతులు పొందాలని, లేకపోతే చర్యలతో పాటు రెండేళ్ల పాటు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. అలాగే ఆరోగ్యశ్రీకి సంబంధించి ఆరోగ్య మిత్రలు పేషంట్లకు సహకరించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ ఆసుపత్రుల నుండి రోగులకు ఇబ్బందులు ఎదురైతే టోల్‌ఫ్రీ నంబర్ 104 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే డీఎం అండ్‌హెచ్ఓ కార్యాలయం ఫోన్ 9440083104, ఆరోగ్యశ్రీ 9642606049కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చని ప్రజలకు సూచించారు.

జనరంజక పాలన జగనన్నకే సాధ్యం



శెట్టివీడులో లబ్ధిపొందిన సంక్షేమ పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: రాష్ట్రంలో జనరంజక పాలన కేవలం జగనన్నకే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని శెట్టివీడు, జ్ఞానాపురం గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి ప్రభుత్వం అందజేసిన పథకాలు, పొందిన లబ్ధిని వివరించారు. అలాగే పాలనతీరును అడిగి తెలుసుకొని, అభివృద్ధి, పథకాలు, నిస్వార్థ పాలన కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు సహకరించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. ప్రత్యేకంగా మహిళలకు జగనన్న చేదోడు, చేయూత, పొదుపు మహిళలకు సున్నావడ్డీ, అలాగే జగనన్న కాలనీల్లో పట్టాలు వారి పేరిట పంపిణీ చేసి ఇంటి యాజమానురాలుగా చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అంతేకాకుండా అమ్మవడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవేన తదితర సంక్షేమ పథకాల ద్వారా నగదును తల్లుల ఖాతాల్లో జమా చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ లక్ష్మీదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, సాగునీటి సంఘం అధ్యక్షులు శేషు రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, అధికారులు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంఈఓ అనురాధ, ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏఈలు షఫీవుల్లా, కొండారెడ్డి, షాజహాన్, సాల్మన్ ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం..

చాగలమర్రిలో రూ.34 కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదివారం ప్రారంభిస్తారని జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్, మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ, పాఠశాల నూతన భవనాలను ప్రారంభించనున్నారని చెప్పారు.

జిల్లా స్థాయి త్రోబాల్ టోర్నీ ప్రారంభం





తిమ్మారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీలు, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీ గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ క్రీడా మైదానంలో శనివారం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ఏడవ జిల్లా స్థాయి త్రోబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా హాజరయ్యారు. శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ పి.దస్తగిరిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తన తండ్రి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఎగురవేసి, క్రీడాకారుల గౌరవవందనాన్ని స్వీకరించారు. పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 108 మంది క్రీడా బృందాలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామకృష్ణారెడ్డి, సుధాకర్, ఏపీరెడ్డి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్, రవికుమార్, దివాకర్, శంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస పౌర్ణమి హోమాలు



జగజ్జననీ ఆలయంలో నిర్వహించిన యమగండ దోష నివారణ పూజలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డులో వెలసిన స్పటిక లింగేశ్వర ఆలయంలో అశ్వయుజ మాస పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం నిర్వాహకులు యోగానంద స్వామి ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్పటిక లింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం జరిపించారు. అనంతరం లోక కల్యాణార్థం హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. నిర్వాహకులు తిమ్మయ్య, గాంధీ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జగజ్జననీ ఆలయంలో ప్రత్యేక పూజలు

పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన శ్రీ జగజ్జననీ దేవాలయంలో శనివారం యమగండ దోష నివారణ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయాన్నే ప్రాతఃకాల పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం యమగండం సమయంలో పూజలు జరిపించారు.

ఉయ్యాలవాడ : అశ్వయుజ పూర్ణిమ సందర్భంగా శనివారం మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడల్లో వెలసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయస్వామి వార్లను ప్రత్యేకంగా అలకంరించి ఆకు పూజ, కుంకుమ, సింధూరార్చన, నవగ్రహ దోషాల, కుజ దోష పరిహార పూజలు నిర్వహించారు. చంద్ర గ్రహణం సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచి ఆలయాలను మూసివేశారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ, అభిషేకాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని అర్చకులు తెలిపారు.

గ్రహణంతో ఆలయాల మూసివేత

ఆళ్లగడ్డ: చంద్ర గ్రహణం కారణంగా నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాలు శనివారం మూతపడ్డాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం, శ్రీ రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రాల్లోని ఆలయాలతో పాటు పట్టణంలోని పలు ఆలయాలను మూసి వేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని అర్చకులు తెలిపారు.



అహోబిలం ఆలయ ప్రధాన ద్వారం మూసివేస్తున్న అర్చకులు

ఊరిస్తున్న మేఘాలు

దొర్నిపాడు: వర్షం కోసం రైతులు రెండు రోజులుగా మేఘాల వైపు చూస్తున్నారు. సాయంత్రం పూట మేఘావృతం అవుతుండటంతో వారిలో ఆశలు రేకెత్తుతున్నాయి. జల్లులు కురిసినా పంటలకు ఊరట లభిస్తుందని ఆశిస్తున్నారు. వర్షం వస్తుందని పత్తి పంటకు చివరగా రసాయన ఎరువులను విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే కాస్త మట్టిపెల్లలు కరిగినా శనగ విత్తనం వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వర్షం కురవాలని గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు.



దొర్నిపాడు వద్ద పత్తి పైరుకు రసాయన ఎరువు వేస్తున్న రైతన్న

పక్కా గృహాలు మంజూరు

శిరివెళ్ల: మండలానికి కొత్తగా 299 పక్కా గృహాలు మంజూరయ్యాయని హౌసింగ్ ఏఈ నాగేశ్వర్ శనివారం తెలిపారు. బోయలకుంట్ల 22, చెన్నూరు 9, గంగవరం 4, గోవిందపల్లె 22, గుంప్రమాన్‌దిన్నె 49, గుండంపాడు 16,జీనేపల్లె 8, కామినేనిపల్లె 10, కోటపాడు 38, మహదేవపురం 26, శిరివెళ్ల 41, వనికినిదిన్నె 12, యర్రగుంట్లకు 39 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురుగు నీటి వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

ఆడిట్ ప్రారంభం

శిరివెళ్ల: మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఆడిట్ శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభమైంది. జిల్లా ఆడిట్ అసిస్టెంట్ ఆఫీసర్ వెంకటరాముడు, సీనియర్ అసిస్టెంట్ స్వరూప కార్యాలయ రికార్డులను ఆడిట్ చేశారు. ఆర్థిక సంఘం నిధులు, జమా ఖర్చులు, పనులు, నగదు పుస్తకాలును ఆడిట్ చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ చేస్తున్నామని ఆడిటర్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం

నంద్యాలటౌన్: కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్ భక్తుల రాంసింగ్‌పై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా నాయకులు పేర్కొన్నారు. విధుల్లో ఉన్న డ్రైవరుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి నిరసనగా జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

వాటర్ ప్లాంట్ మంజూరు

శిరివెళ్ల: మండలంలోని గుండంపాడు గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరైంది. ఈ మేరకు శనివారం ప్లాంట్ ఏర్పాటుపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సరిత, సర్వనరసింహస్వామి ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డి, గ్రామ పెద్ద ప్రతాపరెడ్డితో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. ఏఈఈ మాట్లాడుతు రూ. 5 లక్షల ఎంపీ నిధులతో పనులు చేపడతామని చెప్పారు. అలాగే కోటపాడులో రూ. కోటితో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ పనులు మొదలయ్యాయన్నారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర ఉన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామ సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఈఓఆర్డీ అనసూయ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని, తమ పరిధిలోని లేని వాటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు.

సీ ఫుడ్ ఫెస్టివల్‌ను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల: రొయ్యలు – చేపల ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో రొయ్యలు – చేపల ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధిక పోషక విలువల నిచ్చే రొయ్యలు – చేపల ఫుడ్ ఫెస్టివల్‌ను ఆహార ప్రియులు ఉపయోగించుకోవాలని కోరారు. నవంబర్ 3, 4, 5వ తేదీల్లో కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్‌లో రొయ్యలు – చేపల ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారని, ఫుడ్ ఫెస్టివల్‌లో వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని ఫిష్ ఆంధ్రా బ్రాండ్ కింద యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, జిల్లా మత్స్యశాఖ అధికారి పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



ఆళ్లగడ్డలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేసిన వాల్మీకి సంఘం నాయకులు



నంద్యాలలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి



రుద్రవరంలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన ఆదికవి వారసులుగా ప్రతి ఇంట వాడవాడలా జయంతిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు.లక్ష్మీ నరసింహ, శ్రీధర్, మురళీ ఉన్నారు.

రుద్రవరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు శనివారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సబయ్య, రంగన్న, బాలు, ఉశేని,మహేష్ తదితరులు వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అలాగే చిన్నకబలూరు,ఎల్లావత్తుల,కోటకొండ,ఆలమూరు,గ్రామాల్లో వేడుకలు నిర్వహించి మహర్షి చిత్ర పటాన్ని ఊరేగించారు.

నంద్యాల(అర్బన్): రామాయణ గ్రంథకర్త ఆదికవి వాల్మీకి మహర్షి బాటలో యువత నడవాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న పిలుపునిచ్చారు. రాముడిని దేవుడిగా ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి జయంతిని పట్టణంలోని దేవనగర్, బొగ్గు లైన్, బస్టాండ్ కూడలి వద్దనున్న వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అంతకుముందు సమితి యువత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి మదన్‌గోపాల్, జయరాముడు, నారాయణ, శివ, బైరేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.





నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు, మాట్లాడుతున్న పులికొండన్న